కూలి మనిషి

"కరుణ కుమార"

౧

మాయదారి గాలివాన ఏమని కొట్టిందో- తుడిచిపెట్టి పారేసింది. పచ్చంగా బంగారం పండే పొలాలు, అపరంజివంటి కయ్యలు, రామరామ, ఈ మూడేళ్లుగా మళ్లా అట్లాంటి పంటా లేదు, అట్లాంటి పాడీ లేదు రైతుకు: శిస్తులు ముజరా పోకుండా సర్కారుకు మేలు చేయడానికి, ఏటికి కాసినన్ని నీళ్లు తగలడం, పొలంలో కర్ర గుచ్చామంటే గుచ్చామనుకోవడం తప్ప, మళ్లా అట్లాంటి ఫలితం ఎరగరు జనం. సముద్రంమీదనుండి వస్తుందంటారు కూడా ఇంత హాలాహలమే ఎత్తుకొనివచ్చిందో ఏమోగాని, నారాయణ! ఆగాలిస్పర్శ తగిలినంత మేరా పైర్లే గాదు, పంటలే గాదు, పొలాలే గాదు, చెట్లే గాదు, చేమలే గాదు; పురుగు నాకినట్టు మాడి చక్కాపోయినై - అదేమి విషపుగాలో! ఆఘడియలగాయతు పశువులకూ, మనుష్యులకూ కూడా సిడి పట్టుకొన్నట్టు పట్టుకొన్నది గదా! పొలంచాయ పోయి కయ్యలో అడుగుపెట్టాలంటే, వొలికల్లో అడుగు పెట్టినట్టు, ఏడుపు వచ్చేది! ఏతట్టు బట్టినా ప్రేతకళే! ఇక్కడ మేత లేక పసరాలను పడమటికి కంచెల్లోకి తోలిపెట్టితే, ఈ శనిగాడక్కడకూడా దాపురించాలనా? ఆ రాజ్యంలో గూడా ఏం దెబ్బ తగిలిందో, తాగను నీళ్లూ, మేయను మేతా లేక, ఇపిరివాపూ, జెబ్బవాపూ, తగిలి ఎక్కడిపసరం అక్కడే తా అని చావడం మొదలెత్తుకొన్నవి. ఇంకెట్లా జనం జీవించేది? కయ్యకి ఎంతలేసి సత్తువలు చేసినా, ఎంతెంత కలుపులు తీసినా, ఏమో మహాపండి బోర్లా పడేటట్లు, మొదట మొదట్లో పచ్చంగా ఎక్కరావడమూ, తీరా పొట్టపగిలి వెన్ను తీసే అదునుకు మెడవిరుపో, దుంప తెగులో, మిడత పోటో తగిలి వొరి తాలూ బొంగూ మాత్రం నేలమీద పడడమూను. ఎంతలేసి మోతుబరీ కమతాలయినేమట్టుకు, ఇట్లాంటి దెబ్బలు తగిలితే కాలెత్తకుండా ఎన్నాళ్లని నిలదొక్కుకొని ఉండగలవు?

అట్లాంటిది, మూడేళ్లకింద పండినపంట మళ్లా ఈఏడూ పండింది. ఈ ఏడుకూడా పంటలు నాశిగా తేలినట్టయితే, ఇక ఆగడ్డ విడిపించి ఏ దేశమైనా లేచిపోవాలని ఉన్నారు ప్రజలు. కాని - అభగవంతుడి దయ చల్లగా ఈ ఏడూ నాగేళ్లకూ, గుద్దేళ్లకూ, కత్తవలకూ, కాడిమాన్లకూ, పేడ కుప్పలకూ పసుపూ కుంకుమా పెట్టి, కోడిపిల్లను కోసి దిగదుడిచి పారేసి, ఏ ఘడియని కయ్యలో కాలుపెట్టి ఏరువాక సాగించారో గాని, ఈ మూడేళ్లబొర్రీ ఒక్కసారిగా ఈ ఏడు తీసుకొన్నది. అదీ పంట అంటేను.

మృగశిరాప్రవేశం కావడంతోటే పడమట మబ్బులేవడం, తూర్పునుండి పైరుగాలి తోలడం, రెండు మూడు పదున్లు దిమ్మరించి కాలం చల్లబడడమూను. ఎప్పుడు కురిసిందో, కార్తి తిరిగి కార్తి పెట్టేవరకల్లా వచ్చె, గట్లు తెగ్గోసుకుంటూ, లంకలు ముంచెత్తుకొంటూ, ఎర్రటి ఒండ్రుమట్టితో కూడా వచ్చింది ఏరు. నారు పోసినవాడు నీరు పోయకుండా ఉంటాడా? విత్తనాలు నానబెట్టి నారుకయ్యలు తడిపి చల్లీచల్లడంతోనే, రెపరెపలాడుతూ, మూడోనాటికల్లా మూరెడేసి పొడుగున ఎదిగివచ్చింది మొక్క. అదునంటే అదీ అదును. నారు కయ్యలో మనిషి ఒంగి పైకి చెయ్యెత్తితేనే గాని అసలు అగుపడేవాడు కాడు. అంత మెండుగా పోసిన ఆకుమళ్లయినా వరినాటులందుకొని నారు పెరకబోయేవరకు రొయ్యచేపమూతిమీది మీసాల్లాగా మూరెడేసి లోతున వేళ్లు మూసుకొని మొలక ఊడిరాదే! ఆనారు పెరకలేక చేతులు మంటలెత్తి అల్లాడిపోయారు ఆ సేద్యగాళ్లు అట్లాంటి సత్తువగల నారు నాటితే, శనిగాడు నెత్తినెక్క ఏగాలివానో, ఏవరదలో పట్టి కొట్టుకపోతే చెప్పలేంగాని లేకుంటే పైరు చావమంటేమాత్రం చస్తదా?

మఖా, పుబ్బా, ఉత్తరా కార్తులు వచ్చేసరికే సాఫ్‌ఫీదాగా వరినాట్లు పూర్తిఅయిపోయి అప్పుడే కలుపుతీత లందుకొన్నారు జనం. ఆఁ! ఎంత కలుపుల్లే! ఈ మూడేళ్లుగా నీళ్లు ఎద్దడై, సరిగా అందక నాటువేసిన మలిరోజుకే తుంగ బలిసినట్లు మనిషెత్తున పెరిగి, ఆకలుపుతీతకే అయ్యేది ఎకరాకి నల్తుం, ఏదుం కూలి. అట్లాంటిది ఈఏడు తూమెడూ తూమెణ్ణిరసాతో తొలిమారుమట్టుకు కలుపు తీయించేస్తే, ఇక మళ్లా కయ్యతట్టు కన్నెత్తి చూడవలసిన అగత్యంలేకుండా పోయింది. రెండున్నర నెలలు విడవకుండా పారిందే ఏరు. ఏతట్టు మోటార్లాతట్టే, ఏ తట్టు జనం ఆతట్టే, నిలిచిపోయి అల్లాడిపోయారే ఈయేడు. ఆకొత్తనీటి వురవడిదెబ్బకు భయపడి, ఆఖరుకు పడవ ఆడడంకూడా నిలిచిపోయి, జనాన్ని ఇద్దరికీ అద్దరికీ రవాణా చేయడానికి రైలువాళ్లొక ప్రత్యేక లోకలు నడిపించి దోచుకొన్నారుగదూ డబ్బులు!

అది పంటంటే పంట గాదు. ఎంత సనికిమాలిన నాదారు చేనయినా, ఎకరా పుట్లు కనీసపు పంట అని చెప్పాలి. ఎక్కడనో చెరువుకింద, కట్టకడాన మాలమాదిగవాళ్లకు

సర్కారువాళ్లిచ్చిన చవరభూములుగూడా ఈ యేడు పెట్టికి పండినట్లు చితకపండినై. ఇక మేలురకం దొంపులు అడిగేరూ! అబ్బ! మేలిమిబంగారం! వెన్ను ముట్టుకుంటే గుప్పెట సరిపోతుందా ఉరువు! ఒక్కొక్క కర్ర చెరుకుగడంతలావున పెరిగి గంటలు కట్టి, అడివి అల్లుకొన్నట్లు అల్లుకొని పోయింది. అంత లావుకర్రా కూడా వెన్ను బరువు భరించలేక నేలమీద పడి పారకాడి పోతోంది. గనిమెమీద నిలబడి పొలంచాయ చూస్తే, ఎర్రంగా కన్ను చెదిరిపోతోంది. వెన్ను చేతికి తీసుకొని దూస్తే ముంతెడు గింజలు రాలినట్లు రాలుతున్నవి. దిష్టి తగలకుండా అడుగడుక్కీ కట్టిన సున్నప్పిడతలేనా, గడ్డిబొమ్మలేనా, దిష్టిబొమ్మలేనా, తాటాకులేనా — ఒక టేమిటి! చూస్తే భయంకూడా అవుతోంది. ఈతట్టూ ఆతట్టూ విరగబడిన పైరుతో గనిమెలు కప్పడిపోయి, ఎవరి దొంపు ఏదో కూడా గుర్తు చిక్కడం లేదు.

అట్లా — ఈ వాగర్త వాగర్త అంతా ఏకటాకీని పండిం దీయేడు.

వచ్చేసింది — సంకురాత్రి కూడా వచ్చేసింది. పెద్దపండగ చేసుకొని పెద్దలకు పెట్టుకోవడం, కనుమూ, ముక్కనుమూ పోనిచ్చి కయ్యాలో వొంగడమూను. అయిపోవాలె! గంటలమీదా మినిట్లమీదా కోత లయిపోయి కుప్పలు పడాలె. అప్పుడు గాని రైతుకు నిద్రపట్టుః. ఈ మూడేళ్లుగా పడమటినుండీ ఉత్తరాదినుండీ పండగనెల పట్టేవరకే కూలీజనం తండాలు తండాలుగా దిగిపోయేవారు. ఈ యేడు వాళ్ల దేశం కూడా పండి, చేతినిండా కూలి చిక్కిందో ఏమో, పండగనెల గడిచిపోయినా, జనం ఆముష్మరం లేదు ఈ తడవ.

ఈ ఏడు కోత లెట్లాగబ్బా! దిగులుపడి పోతున్నారు రెడ్లు. సిద్ధాన్నం! నోట్లోకిపోయే కూడు! మహాలక్ష్మి పొలంలో ఆడుకొంటోంది; ఈ ఫల్లెకొంపల్లో పరిస్థితులు ఏమీ బాగుండడం లేదు. ఏతట్టుబట్టినా ఆఁ, ఊఁ, అంటే ఈ కూలీముండాకొడుకులు సమ్మెలూ సభలూ తీర్మానాలూను. నిరుడు సంవత్సరం అసలే పంటలు ఏమీ గాదూ అయి పెట్టుబడిగింజ లయినా వస్తాయో రావో అని రైతు అల్లాడిపోయిన రోజుల్లోనే, ఆవూరిరైతు మూర్తిరెడ్డిని ఈకూలీజనం పెట్టిన తిప్పలు తిప్పలుగావు. ఆయనచేతికింద నీళ్లు త్రాగి ఆయన దగ్గర జీతాలకు కుదిరినసేద్యగాళ్లే ఎదురు తిరిగారే! ఇక ఏడనుంచో వచ్చిన ముంతకూలీ ముండావాళ్ల సంగతి అడగాలెనా? మాట్లాడితే అన్నంపెట్టి శేరు బియ్యం పావలాడబ్బులని ఒక తేదరువుకు మళ్లి కూర్చున్నారు వాళ్లు. ఏనాడూ ఎరగని మామూళ్లన్నీ ఎప్పటికప్పుడు కొత్తవితీసుకొనివచ్చి మెండొడ్డుకొని కూర్చుంటున్నారీమిడిమేలపు పశువులు! ఈ గడ్డ పుట్టింది మొదలు వాళ్లే అన్నం వాళ్లు తెచ్చుకొనేటట్టూ, ముంతెడు వడ్లూ, బేడ డబ్బులూ ఇచ్చేది అనాది మామూలు. అట్లాంటిది ముంతెడు వడ్లకి తోడు ఆరణా లివ్వవలసిందని ఏడిచారు. సరేనని ఒప్పుకున్నారు. కడుపు నిండడంలేదు. రేపటివేళ చద్దిదాహం పోయించమన్నారు. దానికీ ఒప్పుకొని, ఉదయంపూట అంబలి పోయిస్తూ వచ్చారు రైతులు. నిరుడు సంవత్సరం, ఆ ఏర్పాటూ తోసేసి, శేరుబియ్యం పావలా డబ్బులూ యిచ్చి, పగటన్నం మొలగొలుకులు కూడు పెట్టించవలసిందని - ఇంకో బేరం పెట్టారు. అబ్బబ్బా! వీళ్లతో రణపోరూ, శతపోరూను. వాళ్లకి తెలియదు. ఒకరు చెప్తే వినరు. గొర్రెదాటు.

మూర్తిరెడ్డి అంతటివాడు - వాళ్లు అడిగినంత కూలీ యిచ్చి నిరుడు కోతలు కోయించుకొన్నాడే! సేద్యగాళ్ల పెట్టుబళ్లు చాలడం లేదు, సంవత్సరానికి పందుం గింజలూ, రెండు జతల గుడ్డలూ, వరహారొక్కం పెట్టుబడి పెట్టి, నెలకు ఇద్దుంగింజలు యిస్తేనే గాని, మేడితోక అట్లా ముట్టుకోమని ఎదురు తిరిగితే, పాపం! అంతలావురెడ్డీ, ముక్కుమీద వేలేసుకొని, 'ఏమిరా కాలం!' అని ఆశ్చర్యపోయాడు. అట్లాంటిది, ఈసంవత్సరం పంటలు చూడబోస్తే, బంగారం పండి బలి కోరుతున్నాయి. కూలివాళ్లు చూడబోస్తే ఆవిధాన్న ముక్కుపట్టని ముత్యాలై వాళ్లు కూర్చున్నారు. ఎక్కడికి పోతారు రెడ్లు? ఏవూరు పోయినా, గిరాకీరోజులు, రద్దీ దినాలు! ఇదే పోరుగదూ! పోనీ, అడిగినంత కూలీ ఇస్తా మనుకొన్నా, రెండుకాళ్లూ, రెండుచేతులూ ఉన్న మనిషంటూ, ఉరువు అగుపడితే ఎట్లానయినా ఊరేగవొచ్చు. ఒంటినిండా గుడ్డా, కడుపునిండా కూడూ లేని జనాన్ని ఇంత చాలీచాలకుండా పుట్టిస్తే, సృష్టి ఎట్లా జరగా లనుకొన్నాడీభగవంతుడు! ఏయెకరమో అరెకరమో అయితే ఒకరోజుపట్టు. రెండురోజులయినా మానె, ఎట్లనో ఏడ్చి అయిం దనిపించుకోవచ్చు. ఏభయ్యేసి ఎకరాలు, నూరేసి ఎకరాలు, రెండువందలేసి ఎకరాలు పెట్టుకొని ఊరేగే కమతా లీగండం గడిచి గట్టెక్కేది ఎట్లా?

గోచీపాతో పెట్టుకొని అర్ధదిగంబరత్వంతో తిరిగేమనిషి ఆడదిగాని, మొగాడుగాని, వయసువాడుగాని, ముసలివాడుగాని, కంటి కగుపడితే సరి, వెంటబడుతున్నారు ఆసాములు. 'కూలివిషయాని కేమిలే, అందరికంటే ఇంకో చిన్నడబ్బు అదనంగానే తీసుకో' అని చెయ్యిపట్టుకొని లాక్కొనిపోతున్నారు. కొంతమంది మరీ పెద్దపెద్ద ఆసాములు, ఒకటి రెండు రోజులు ముందుగానే జాగ్రత్తపడి, కుటుంబాల సహితంగా గొర్రెలగుంపులాగా తోలుకొనిపోయి, బందెలదొడ్లో పెట్టినట్లు పశువులకొట్టాలలో పెట్టి, తలుపులు బిగించి, రాత్రింబగళ్లు కాబ్దారీలు చేసుకొంటున్నారు — కూలీ జనాన్ని!

౨

"అబ్బా! అమ్మా! అమ్మా!..."

"........................"

"ఇస్సు: ఇస్సు: పరమాత్ముడా! తండ్రీ! పగవాడికూడా వద్దురా!..."

అని ఆ తాటాకుల చుట్టుగుడిసెలో గడ్డిమీద ఈతాకులచదర పరుచుకొని, మూలుగుతోంది — లక్ష్మి.

మినుకుమినుకు మంటోంది — ఓ సన్నని పగడంలాంటి బుడ్డిదీపం. పక్కలో కూర్చొని తల నిమురుతున్నాడు — మామ పెంచెలుగాడు, బుడ్డిదీపం క్రీనీడ కాంతిలో తళతళలాడే కళ్లల్లో కళ్లు పెట్టుకొని, నుదుటిమీద నుదురు చేర్చి.

"అమ్మీ! నువ్విలా ఆయాసపడితే నాకు దిక్కుతోచ"దన్నాడు పెంచెలు.

"పరమాత్ముడా! నారాయణమూర్తీ! ఊఁ! ఊఁ! అబ్బ! నే బతకనయ్యో! మామా!" అని కంట నీరుపెట్టింది లక్ష్మి.

"ఓర్చుకో! ఓర్చుకో! అమ్మీ! ఆ నారాయణమూర్తి పెట్టినగడియ ఇంకా రాలేదు" అని ఓదారుస్తున్నాడు పెంచెలు.

"మామా! దినానికి శేరుబియ్యం, పావలాడబ్బులూ, పైటన్నం పాడయి పోయింది గదే ఈ యేడు! నా కీగండం రాకుంటే, నీచెయ్యికి నాచెయ్యి కలిపి ఇద్దరం తెచ్చుకొనేవాళ్లం గదే!..." అని ఇస్సుమన్నది లక్ష్మి!

"ఎంతదూరం చెప్పినా నువ్వు ఆవూసు విడిచిపెట్టవు గదూ —" అన్నాడు పెంచెలయ్య.

"అయ్యో! ఓ రెండునెలలపాటు దిగులు లేకుండా పొయ్యేది గదే, మామా —" అని మూలిగింది లక్ష్మి.

"అబ్బా! నా రెక్క లుండంగా నీకడుపు నిండదూ? వోపలేని మనిషివి కదల్లేవు మెదల్లేవు. నీ కెందు కాదిగులు? నాకడుపులో అన్నం తీసి నీకడుపులో పెట్టి బతికించుకొంటాను నిన్ను. ఆవూసు మరిచిపో".

"ఇస్సు: ఇస్సు: నువ్వయినా కూలి చూసుకొన్నావా లేదే! రద్దీదినాలు పోగొట్టుకోవోక" అన్నది లక్ష్మి.

"ఆనారాయణమూర్తి దయపెట్టి, రెండు తలలూ వేరయి పిల్లా తల్లీ సుఖంగా ఉన్నారనుకొంటేగాని నే కూలికే పోను. ఎదవ డబ్బులైరి" అన్నాడు పెంచెలు.

"అయ్యో! అబ్బా! అమ్మా! నా ప్రాణాలు పోతుండై మామా! కానిరోజులు వచ్చిపడ్డై, ఎట్లా చేస్తావో" అని ఏడిచింది లక్ష్మి.

"నువ్వేడవబోక పిల్లా! మొన్ననే చిన్నరెడ్డి పాదాలు పట్టుకొని తూమెడు గింజలు నాయుకు తెచ్చుకొన్నానుగదా! ఆగింజలతో ఇంకా పదిరోజులదాకా దిగులులేదు. అటు పైని దేవుడే ఉండాడు— "

"మాయదారి కానుపు. ఈపాటికి బయటపడవలసిందే, పడిందిగాదు. ఏం చేయను. పదిరోజుల కిందటనే ఈబరువు వొదిలిపోతే, బిడ్డని ఒళ్లోకట్టుకొని అయినా పోయేదాన్ని కూలికి."

"నీ ఇష్టమూ నా ఇష్టమూనా? మన దినాలు మంచివైతే ఆ తొలికాన్పుకు పుట్టిన పిల్లోడే దక్కేవాడు. ఇంకో ఏడాదికి ఏబ్రెగొడ్డుకాడనయినా పెట్టుకొంటే చేతి కక్కరకు వచ్చేవాడు" అని తల నిమిరాడు పెంచెలు.

"నా ముఖాన్ని ఆరాత లేదు మామా!" అని పెనిమిటిమెడ చుట్టవేసుకొన్నది లక్ష్మి.

"ఏడవ్వోకు: నీరోజు మంచిదయి, ఈ కడుపు పండకూడదూ?" అని ఆమె కళ్లు తుడిచాడు పెంచెలు.

"అబ్బా! మామా! ఈ రాత్రి గడిచేది ఎట్లనే? ఇంట్లో రెండో ఆడదిక్కు లేదు. నువ్వొంటరిగాడివి. ఎట్లా చేస్తావే?" అని చాపమీద పొర్లింది లక్ష్మి.

"ఆడదయితే అదనమా? అన్నిపనులూ నేనే చేస్తాను. ఆ కాన్పుకు మా అమ్మ ముసిలిముండ ఉండబట్టి ఆదుకొంది. ఎన్నాళ్లుంటారు ముసిలోళ్లు. నాకు నువ్వూ, నీకు నేనూ, మనిద్దరికీ ఆ భగవంతుడూ దిక్కు. దిగులు పడబోక: బుడ్డితో బుడ్డెడు బ్రాందీ తెచ్చి తయారుగా ఉంచాను" అని ధైర్యం చెప్పుతున్నాడు పెంచెలు.

ముఫయ్యేళ్లు పెంచెలుగాడికి. మాలవాడు. పిడుగు. పిడిరాయిలాంటి దేహం. తండ్రిరుణం కేవలం చిన్నతనంలోనే తీరిపోయింది. ఒక్కగాక ఒక్కపిల్లవాడు కాకిపిల్ల కాకికి ముద్దుగదూ. ప్రాణాలన్నీ ఆ కొడుకుమీద పెట్టుకొని పెంచి పెద్దవాణ్ణి చేసింది తల్లి.

తన తల్లిదండ్రులవల్ల అతగాడికి సంక్రమించిన ఆస్తి ఐశ్వర్యం కండలు మెలిదిరిగిన తనశరీరం తప్ప రెండో ఆధార మేమీ లేదు - ఆఏకాకికి. మేడితోక పట్టుకొని ఎద్దులను ముల్లుకర్రతో తోలి భూమిని చీలికలు చేసే శక్తి అతని బాహువుల్లో ఉన్నది గాని భూమే లేదు అతగాడికి. చేతిలోకి మేడితోకే లేదు - ఆమనిషికి. తా నిప్పుడు తాటాకుల గుడిసే వేసుకొని జీవించే ఆచోటు పెద్దరెడ్డిది. పక్కన ఉన్న మామిడిచెట్లనూ, తోటకయ్యనూ, మిరపచేనూ కాబ్దారీ చేస్తుండే షరత్తుమీద ఆస్థలంలో గుడిసె వేసుకొని స్థావరం ఏర్పాటుచేసుకో నిచ్చాడు పెద్దరెడ్డి. కూలిపని చేసుకొని పొట్ట పోసుకొంటున్నాడు — పెంచెలు. ఎర్రటి ఎండలు కాసినా, కుంభపోతగా వర్షాలు కురిసినా, పిడుగులు పడినా ఝంఝామారుతం వీచినా వాడి కాచుట్టు గుడిసే పెట్టని కోట, పెద్దరెడ్డి అనుగ్రహం.

భార్యకు ప్రసవదినాలు. తొలికాన్పు నష్టమై పోయినదిలగాయతు ఆ దంపతులు పిల్లలకోసరం అలవటించి పోతున్నారు. భార్యకు పెనిమిటిగాని పెనిమిటికి భార్యగాని క్షణం ఎడమైతే భరించలేని మమకారం వాళ్లిద్దరికీని. అందువల్ల భార్యను ఆస్థితిలో

విడిచి కూలిపనికి పోలేక, ఇంటిపట్టునే నిలిచి పోయాడు పెంచెలు.

ఆరాత్రి తెల్లవార్లూ లక్ష్మి వేదనపడుతూనే ఉన్నది. ప్రసవం కాలేదు. కంటిమీద కునుకెటువంటిదో మరిచిపోయి, మంత్రసానిపని తానొంటరిగా జరిపించడానికి సిద్ధపడి కూర్చున్నాడు - పెంచెలు

ఇంకా వేకువజామే! కోళ్లు కూసే సమయం. తూర్పున చుక్క పొడిచిన వేళ. భార్య బాధ పడిపడి, అలిసే పోయిందో, స్మృతి తప్పేపోయిందో, గంట సేపటినుండి మాటామంతీ మూలుగూ ముక్కూ లేకుండా అట్లా పడిఉన్నది. పెంచెలయ్యకు భయం వేసింది. బుడ్డిదీపం ఆమె ముఖందగ్గర పెట్టి పరీక్షించి చూచుకొన్నాడు. ముక్కువెంట శ్వాసఆడుతూనే వున్నది. గుండెలు కొట్టుకొంటూనే ఉన్నవి. నాడి ఆడుతూనే ఉన్నది. ఒంటరిగాడు ఏమి చేయగలడు!

బయట ఎవ్వరిదో కిర్రుచెప్పుల చప్పుడు.

"పెంచెలుగా!" అని ఇద్దరు మనుష్యుల కంఠధ్వని ఏకకాలమందే అతని చెవిని పడింది.

ఓ బెబ్బులి కేక వేసి, వెన్ను చరిచినట్టు అదిరిపడి గడగడలాడే గుండెను గుప్పిట్లో పెట్టుకొని బయటికివచ్చాడు పెంచెలుగాడు. చూస్తే పెద్దరెడ్డీ చిన్నరెడ్డీను...

వాడు తనకళ్లు తానే నమ్మలేకపోయాడు. 'ఏమి విచిత్రం, ఎన్నడూ లేదే! అన్నదమ్ములయినా గర్భశత్రువులే. ఒకరిపచ్చ మరొకరు ఓర్వలేని ఏకోదరులే! మొన్న మొన్నటివరకూ కుటుంబాస్తి పంపకంవిషయంలో తగువులు పెట్టుకొని కోర్టు కెక్కి, కత్తులు నూరుకొన్న అన్నదమ్ములు, ఆ సమయమేమిటి? ఏకకాలంలో రావడ మేమిటి? ఆ పిలవడ మేమిటి?'

నిర్విణ్ణుడై పోయాడు పెంచెలుగాడు.

"కోతకు మనుష్యులు చాల్లేదు. నువ్వూ నీపెళ్లామూ గూడా రావాలి, రండి" అని ఇద్దరూ పాఠం అప్పచెప్పినట్లు ఒక్కసారిగా పిలుస్తున్నారు. పెంచెలుగాడికి ఖంగారుగా ఉన్నది.

"కోత ఎక్కడ సామీ!" అని అడిగాడు.

"వరవల చేలో" అని పెద్దరెడ్డీ,

"అంకమ్మ దొంపుల్లో" అని చిన్నరెడ్డీ తమతమ పొలాలు గుర్తు చెప్పారు.

పలకలేదు పెంచెలుగాడు.

"పలకవేం?" అని యిద్దరూ అడిగారు మళ్లా.

పలకలేదు పెంచెలుగాడు.

"నీళ్లు నమిలితే ప్రయోజనం లేదు. రెండేళ్లుగా నా స్థలంలో గుడిసెవేసుకొని కాపరం ఉంటున్నావు — తెలుసునా" అన్నాడు పెద్దరెడ్డి.

"మొన్ననే గదరా, కూటికి లేవని తూమెడు వడ్లు నామకు తెచ్చుకొన్నావు నాదగ్గర -" అన్నాడు చిన్నరెడ్డి.

"చిత్తం -" అన్నాడు పెంచెలు.

"మరి నోరులేదూ? ఖండితంగా చెప్పెయ్యి" అన్నాడు చిన్నరెడ్డి.

"ఏం చెప్పేది సామీ? గుడిసెలో ఆడమనిషి కనలేక మాటలేకుండా పడిపోయింది. ఆ మనిషి కుదురుగా ఉంటేనేగాని నేను కూలికి రాలేను నా ఏలినవాడా?—" అన్నాడు పెంచెలు.

"అటయితే నాకాడ వొడ్లు ఎందుకు తెచ్చుకున్నావూ?—" అని అడిగాడు చిన్నరెడ్డి.

"నామకు తెచ్చుకొన్న గింజలు కదా సామీ అవి. ఉగాదినాటికి నాముతో కూడా మీ గింజలు మీకు కొలిచేస్తాను; బాకీ పెట్టుకోను లే" అన్నాడు పెంచెలు.

"ఆ పప్పు లేమీ ఉడక వోయ్! అబ్బయ్యా! నువ్వూ నీపెళ్లామూ గూడా కోతకి వస్తారని గదా నేను గింజలు కొలిచిపెట్టింది? నాము నాము అంటే ఎవరికోసరం ఇస్తావు నాము? నాము కొలిస్తే కోతపని ఏంగావాలనుకొన్నావు?" అని చిన్నరెడ్డి తొందర చేశాడు.

"ఆడమనిషిని ఆవిధాన్ని విడిపించి నేనెట్లా వచ్చేది సామీ?" అన్నాడు పెంచెలు.

"నువ్వు నడుస్తావా? మెడమీద నాలుగు గలీతాలు పెట్టుమంటావా?" అని చిన్నరెడ్డి చేతికర్ర వాడి మెడమీద బెట్టి ముందుకు నెట్టాడు.

నాలుగడుగులు ముందుకు తూలేడు పెంచెలు.

"నేను రావడానికి లేదు సామీ" అంటున్నాడు పెంచెలు.

"ఎవడి కోసరం వస్తావు? గింజలు తేరగా ఉన్నా యనుకొన్నావూ?" అని మళ్లా నెట్టాడు చిన్నరెడ్డి. ఇంకా నాలుగడుగులు తూలేడు పెంచెలు. ఇదంతా నిదానంగా చూస్తూవున్న పెద్దరెడ్డికి చుర్రుమనింది.

"ఏంవోయ్! పెద్దమనిషీ నామనిషి నట్లా నెట్టుకొంటూ పోవడం?" అని అడ్డుతగిలేడు పెద్దరెడ్డి.

"ఏమోయ్ నెట్టితే?" అని ఎదిరించాడు చిన్నరెడ్డి.

"వాడు నామనిషి-" అన్నాడు పెద్దరెడ్డి.

"నీమనిషి! గడించావు. నామనిషి" అన్నాడు చిన్నరెడ్డి.

"నువ్వు పుట్టించావు! ఇప్పటికి రెండేండ్లుగా నా స్థలంలో వాడు గుడిసె వేసుకొని కాపరం ఉంటూంటే నీమనిషెట్లా అయినాడోయ్?" అన్నాడు పెద్దరెడ్డి.

"నిన్నగాక మొన్న నాదగ్గర తూమెడు వడ్లు నాముకు తెచ్చుకొంటే నీమని షెట్లా అయినాడు—" అన్నాడు చిన్నరెడ్డి.

"అబ్బా! శానా యిచ్చాడోయి గింజలు. తూమెడు వడ్లు ఇచ్చాడంట. టిరిసెం! పదరా

మనచేలోకి, పదరా ఏంచేస్తాడో చూతాం''- అని పెద్దరెడ్డి పెంచెలుగాడి చెయ్యి పట్టుకొని లాగేడు.

"ఏడకిరా నీవు పోయేదీ? కాళ్లు విరగ బొడుస్తా చూడు!" అని చిన్నరెడ్డి పెంచెలుగాడి జుట్టు పట్టుకొని తనపక్కకి లాక్కొన్నాడు.

"సాములారా! నే నిద్దరికీగూడా కూలికి రాలేను సామీ! వోపలేనిమనిషి, ఒళ్లు తెలియకుండా గుడిసెలో పడిపోయింది—" అని గోలపెట్టుతున్నాడు పెంచెలు.

"గుడిసెలో మనిషి. చావనీ. పీడ విరగడై పోతుంది" అని పెంచెలుగాడి మెడమీద కర్ర పెట్టి నెట్టాడు చిన్నరెడ్డి.

"ఏందోయ్? ఈ దౌర్జన్యం! ఈ పాలి వాడివంటిమీద చెయ్యి వేయి, చెప్తా నీపని." అని పెద్దరెడ్డి చిన్నరెడ్డిమీదికి వచ్చాడు.

"ఏందోయి నువ్వు చేసేది? పక్షీ!" అన్నాడు చిన్నరెడ్డి.

"పక్షి ఎవడురా? కుంకా!" అన్నాడు పెద్దరెడ్డి.

"కుంకా గింకా అన్నావంటే, మూతిపళ్లు రాల్తాయి భద్రం—'' అన్నాడు చిన్నరెడ్డి.

"మూతిపళ్లు రాలితే తల చెక్కలుగా పగుల్తుం" దన్నాడు పెద్దరెడ్డి.

"నీ అబ్బ లేచిరావాలిరా ముండమోపీ!'' అని పక్కన ఉన్న రాగోలుకర్ర తీసుకొని పెద్దరెడ్డిమీదికి దూకాడు చిన్నరెడ్డి.

"నీ ఆయువు మూడింది రారా! లమ్డీకే'' అని పక్కన ఉన్న గోకలి తీసుకొని చిన్నరెడ్డిమీదికి వచ్చాడు పెద్దరెడ్డి. గడగడ లాడుతున్నాడు పెంచెలు.

"కొట్టుకోబోకండి సామీ!" అని యిద్దరి సందునా దూరాడు పెంచెలు.

అన్నదమ్ముల ఆగ్రహం ఒక్కసారిగా పెంచెలుమీదికి తిరిగి,

"ఛీ! మాలమాదిగకొడకా! ఇద్దరికీ కూలికి వస్తానని చెప్పి మోసం చేస్తావా? చావు గాడిదకొడకా!—"

అని గోకలీ, రాగోలుకర్ర ఏకకాలమందే పెంచెలుగాడి నెత్తిన కొట్టారు సోదరులు

"చచ్చాను బాబో!—'' అని నెత్తురు చిమ్ముకొని నేలమీదపడ్డాడు పెంచెలుగాడు.

"నేను ఎందుకు పుట్టాను బాబో!" అన్నట్టుగా నెత్తురు చిమ్ముకొని నేలమీద పడి కేరు కేరుమని ఏడిచింది గుడిసెలో బిడ్డ.